# దారితప్పిన బాటసారి



ఎన్. కె. రామారావు

"రాత్రి నల్లని రాతి పోలిక—గుండెమీదనె కూరుచుండగా"—నిద్ర పట్టటం లేదు పోలికి.

రాత్రి - చిమ్మ చీకటిగా వుంది. రాకాసి బొగ్గు పొడిని ప్రపంచం అంతా పూశారా అన్నంత నల్లగా వుంది. కరువులో అధిక మాసంలాగా దానికి తోడు మబ్బులు.

మంచం ఇరుకుగా వుంది. కదిలినప్పు డల్లా కిర్రు మంటున్నది నులక మంచం. మబ్బులు గాలి, చీకటికి "విటమిన్లు"గా వుపయోగపడి లోకాన్ని మరింత చీకటి తరం చేస్తున్నాయి.

దూరాన—ఓకుక్క - దిక్కూ దివాణం

లేని వీధి కుక్క—"కుఁయ్యో"మని సైరన్‌లా అరిచింది.

ఉలిక్కిపడింది పోలి. లేచింది. నులక మంచం పట్టెమీద కూర్చుంది. రెండు చేతులూ తలకాయకు చేర్చి గుడిసె నలు మూలలా చూసింది. "కోడిగుడ్డు దీపపు" వెలుగులో ఓ మూల ఓ కాలు విరిగిన పీట - చిలుము పట్టిన ఓ రేకుపెట్టె— దండమీద ముదురాకు పచ్చ రెండు చీరలు- ఓ పల్చటి బిందె - రెండు కుండలు - ఎప్పుడూ కనపడేవే—కనిపించాయి.

బయట గాలి హోరు విపరీతంగా వుంది. "నేను లేకుంటే మీరు లేరు" అన్నతం ధీమాగా వుంది గాలికి.

మంచం కిర్రుమంది. దానిమీది బొంతలో పడుకున్న పోలి కొడుకు - దాసుకు జ్వరంగా వుంది.

పోలి వెళ్ళింది. మంచం దగ్గరగా వంగుని దాసు బుగ్గమీద చేయి వేసింది. వళ్ళు చాలా వేడిగా వుంది దీపపు వెలుతురు ఒక్కసారిగా ఎక్కువయింది. పోలి వెనక్కి తిరిగి దీపంవైపు చూసింది. దీపం ఆరిపోయే ముందు వెలిగే అద్భుతమయిన వెలుగది. పోలికి తెలుసు. ఆ దీపం ఎందుకలా వెలిగిందో, దాన్లో కిరసనాయిల్ లేదు

"అమ్మా....అమ్మో ఆకలే" మూలిగి పక్కకు తిరిగాడు దాసు. మంచం మళ్ళీ కిర్రుమంది. పోలి కడుపులో పేగులు కూడా "కేరు"మన్నాయి.

"చూడూ - పోలమ్మా - ఇలా అయితే ఏమీ బాగుండలేదు. నీ కొడుక్కి జ్వర మయితే మమ్మల్నేం చేయమంటావ్ ? ఏదో కాస్త మా మొహాన పడేయి. లేకుంటే పని మానేస్తాం"—బెదిరించాయి పోలి పేగులు.

చుట్టూ చీకటి. పోలి లేచింది. తడుము కుంటూ వెళ్ళి రేకు గ్లాసుతో రెండు గ్లాసుల నీళ్ళు పొట్టలోకి పంపించింది. కరువు భత్యం పెంచగానే సమ్మె మానేసిన వుద్యోగుల్లా. గప్‌చిప్‌గా వుండిపోయాయి పేగులు. "హమ్మయ్య" అనుకుంది పోలి.

కళ్ళమ్మట నీళ్ళు తిరిగాయి, "ఈ దుర్మార్గుడు ఇంక వచ్చి సావలే. కట్టుకున్న దాని సుకం లేకపోతే పీడా పోయె. కన్నోడికి జొరం కాసిందన్నా చూసే దిక్కు లేకపోయె. యాడ తాగుకుంటూ కూకున్నాడో"—చెరువు అలుగుమీద నుంచి పారే నీటిలా దుఃఖం వస్తున్నది.

దాసు మూలుగు మొదలెట్టాడు. మూలుగు మూలుగుకూ పోలి ప్రాణాలు వెళ్లుకు వస్తున్నాయి. "బగమంతుడా— ఈ ఒక్క రాత్తిరి నా కొడుకును రచ్చించు. తెల్లారి దరమాసుపత్రికన్నా తీస్కపోతా"

వాన మొదలయింది. బయట రిక్షా ఆగిన చప్పుడూ, దాని వెంట ఓ పాట- పాట తలుపుదాకా వచ్చి ఆగిపోయింది.

తడక తలుపుమీద వేళ్ళ చప్పుడు.

"టక్-టక్-టక్"

.... .... .... ....

"కాయ్ రాజా కాయ్ రాజా కాయి"

.... .... .... ....

'టక్-టక్-టక్"

.... .... .... ....

"కాయ్ రాజా కాయి"

పాట ఆగింది. చప్పుడూ ఆగింది.

"ధూత్ - నీయ్యాలి - ఓకున్నదే లోనా-తలుపు తియ్య—బద్మాష్ లం—"

తలుపు తెరవబడింది. సుడిగాలిలా లోనకు ప్రవేశించాడు సూరాయి.

సూరాయితోపాటు సారాయి కంపు కూడా లోపలికి వచ్చింది దాంతోపాటు కాస్త వానజల్లు, వానజల్లుతోపాటు ఓ కుక్కపిల్ల కూడా లోపలికి వచ్చాయి. జేబులో చేయి పెట్టాడు సూరాయి. అగ్గిపెట్టె తగిలింది. బయటకు తీసి ఓ పుల్ల గీశాడు ఆ వెలుతురులో పోలి ముఖం చూశాడు - మంచంమీద పిల్లడిని చూశాడు - ఇంటి కప్పుకేసి చూశాడు. చేయి చురుక్కుమంది. అగ్గిపుల్ల ఆరిపోయింది.

"బువ్వేమన్నా వుంటే పెట్టు."

'బువ్వ - అన్వ - ఏడకెల్లి తెమ్మంటవ్ నిన్నటాల బట్టి గింజన్నా లేకపోయె. పిల్లోడికి జొరంగా వుండె—నువ్వు రాకపోతివి - నన్ను సావమంటావా - సెప్పు - సస్తా - లేపోతే నువ్వే నా గొంతు పిసుకు-సస్తా - ఈ బాదలు నేను పడ్లేను. ఈ యమ సెర నాకింకొద్దు. ఈ కత్తులమీద నడక - ఇంక నా సాత కాదు. ఇగ నువ్వు బతకమన్నా నేను బతకను. ఆ బగమంతుడి దయవల్ల ఈ ఒక్క పిల్లోడు. ఈడికి జొరం కాసిందన్నా సూసే దిక్కు లేక పాయె ఇక ఈ కట్టాలు నేను పడను కాక పడను"

అగ్ని పర్వతాన్ని బ్రద్దలు చేసుకుని బయటకు వచ్చిన లావాలా, వేడిగా, వాడిగా వేగంగా వస్తున్నాయి మాటలు.

"సర్లే—నాకిన్ని మంచినీళ్ళియ్యి—తెల్లారి దరమాసుపత్తిరికి తీస్కపోవాం అడిని."

వాన వెలిసింది. పోలి ముడుచుకుని దాసు మంచంలోనే పడుకుంది.

## 2

'దరమాసుపత్తిరి'వద్ద జనం 'క్యూ'లో నిలబడ్డారు. ఊర్లోని అనారోగ్యం అంతా మూట కట్టి అక్కడ దింపారా - అనిపిస్తుంది. డాక్టరుగారు టెర్లిన్ చొక్కా-టెర్రికాటన్ ప్యాంటులోకి పంపించి, తెల్లగా, అయిసు ముక్కలా, అమెరికా వాడు కాలు పెట్టకముందు చంద్రుడిలా, (పెట్టింతర్వాత చంద్రుడు మారాడని కాదు - "ఛీ - చంద్రుడూ నువ్వెంత పనికి మాలినవాడివి" అని కార్టూనులు, కవితలూ వచ్చాయిగా) "నా ఆరోగ్యానికి కారణం" అన్న పోజులో వున్నారు. "హార్లిక్సు" తాగకున్నా—హమామ్‌తో స్నానమాడకున్నా సూరాయి కూడా రాయిలా గట్టిగానే వున్నాడు. వాడి చేతుల్లో దాసు—ఏసు ప్రభువు చేతుల్లో గొర్రెపిల్లలా

పడుకుని వున్నాడు. వాడి కనురెప్పలు వాలి వున్నాయి. సూరాయిని కావిలించు కున్న వాడి రెండు చేతులూ రెండు బక్క-చిక్కిన బురదపాముల్లాగున్నాయి. వాడి జుత్తు మొక్క-జొన్న పీచులా వుంది. గుండె ఎముకలు "ఎక్సరే" అక్క-ర్లేకుండానే కనిపించేలా వున్నాయి.

కొండచిలువలా వున్న "క్యూ" కదలటం మొదలెట్టింది.

"డాట్రుగారూ"—— రెండు కాళ్ళూ లంకించుకున్నాడు సూరాయి లంకె బిందెల్లా-

"ఛత్-వదులు-వదట్లా" పక్క-కి తిరిగి చూసి, నవ్వుతున్న నర్సును చూసి సిగ్గు పడిపోయాడు 'డాట్రు' గారు.

"తమరే రచ్చించాలి నా కొడు కును"—— కాళ్ళు వదిలేశాడు సూరాయి.

ప్యాంటు నలిగిందో-లేదో చూసుకుని, జేబులోంచి రుమాలు తీసి నుదురు తుడుచు కున్నారు "డాట్రు"గారు. తీయని ఖరీదైన సెంటు వాసన, ఫాను ద్వారా హాలు నాలుగు మూలలా పాకింది.

కుట్రాచీని బల్లమీద పడుకోబెట్టారు. పదినిమిషాలు పరీక్ష చేశారు. పదిమాత్రలు ఇచ్చారు. ఒక ఇంజక్షన్ ఇచ్చారు. మాత్రలు పూటకొకటి వేయమన్నారు. మూడుపూటలా పాలు తాగించమన్నారు. రోజుకో గుడ్డు అన్నారు. అదికాక రోజుకో బత్తాయి అన్నారు. ఇంకా "ఇదిగో - ఈ రెండు మందులూ కొను క్కు-రా. చాలా ముఖ్యం-ఇవి ఆసుపత్రిలో దొరకవు" అన్నారు.

"ఆసుపత్తిరి నుంచే —— ఇయ్యండి నాయనా-బీదోడ్ని-కాళ్ళమీదపడతా" వేది రించాడు సూరాయి

"ఎవడ్రా-మీకీ కాళ్ళమీదపడే టెక్నిక్ నేర్పింది. కాళ్ళమీద పడితే పన్లవుతయ్యా-ఆసుపత్రిలో వుంటే ఇవ్వాలని మాకు తెలియదా-లేపు! పో-పో" కసిరాడు డాక్టరు గారు.

"పోనీ, ఎంతవుద్దో నన్నా సెప్పం డయ్యా".

"ఎనిమిది రూపాయలు కావచ్చు"

ఎనిమిది రూపాయలంటే భయం వేసింది. పిల్లడిని ఇంటికితెచ్చి పడుకో బెట్టాడు.


"సూదిమందు-ఎనిమిది రూపాయలు ఎట్టా తెద్దాం" సమస్య ప్రశ్నగుర్తుతో ఎదురుగ్గా నిలుచుంది.

పోలికళ్ళు ఎఱ్ఱగా వున్నాయి. పొట్ట లోతుకు పోయింది.

"అట్టనే -- మనకిన్ని —— నూకలకు పైసలు సూడు మాఁవా".

ఆ మాట చాలా చిన్నది. ఆ అభ్యర్థన వెనుక, "నిన్ను గనమైన కోరికలు కోర్లేదు కోకలు అడగలేదు- ఈ పొట్టలో ఇన్ని గంజినీళ్ళు పోసి నాట్రోజులు బత కని" అన్న అర్థం వుంది.

పెళ్ళాం ముఖం చూసేసరికి బాధని పించింది సూరాయికి. దాని మోహం వాడి




పోయిన మల్లెపూవు లాగున్నది.

"ఉచ్చాను, ఉచ్చాను-దానికి నేనేం న్యాయం సేసాను, కార్లు బంగ్లాలు మన జనమలకి రాసిపెట్టి లేవు.

ఓనాడు ఓ మంచి రవికె ముక్కయినా తెచ్చిచ్చానా?'' ఇయ్యాల కనీసం కడుపు నిండా కూడు కూడా పెట్టలేక పోతున్నా''—

ఇలా ఏన్నోసార్లు జ్ఞానోదయం కలుగుతూ వుంటుంది. సాయంత్రం కాగానే రిక్షా కిరాయిచ్చేసి, అలా సారాయిదుకాణం మీదనుంచి వస్తుంటే, ప్రాణాలు లాగుతాయి. దాంట్లోకి వెళ్ళింతర్వాత, ఎక్కడ లేని వేదాంతం వచ్చేస్తుంది, జన్మరహస్యాలన్నీ బోధపడినట్లవుతుంది. దేవుడు రాసి పెట్టే నూకలకి డబ్బులు మిగులుతాయి. లేకుంటే?''

"సర్లేవే తెత్తా'' హామీ యిచ్చి కదిలాడు.

### 3

బస్సుస్టాండులో జనం చాలామంది వున్నారు. వచ్చేబస్సులు వస్తున్నాయి. పొయ్యేబస్సులు పోతున్నాయి. వచ్చే బస్సులనిండా కిటకిటలాడే జనం, పోయే బస్సుల్లో కూడా అలాగే.

రాత్రి పడినవర్షం మూలంగా బస్టాండులోని నేలంతా తడి తడిగా బురద బురదగా వుంది. అరటిపళ్ళ తొక్కలు-బీడీ పీకలు-సిగిరెట్టు ముక్కలు, కిళ్ళీలు నమిలి వుమ్మేసిన తాలుకు రక్తారుణ చిహ్నాలు-బస్సులు తిరిగేచోట ఏర్పడిన గుంటలు-వాట్లో టీ లాంటి ఎఱ్ఱటి వాన

సీళ్ళు-దాంట్లో బస్సుల తాలూకు అయిల్ కారి ఏర్పడిన తాత్కాలిక ఇంధ్ర ధనస్సులు.

సూరాయి మనస్సు కూడా బస్సుస్టాండులానే గజిబిజిగా వుంది.

"హాం ఆదొర సూట్‌కేసు పట్టుకుని ఇటే వస్తుండు."

సీటుతీసి దులిపి మళ్ళీ వేశాడు. దారి తప్పి రాబోయి సరయిన దారి తెలుసుకున్న వాడిలా సూట్‌కేసువాలా వేరేవైపు వెళ్ళిపోయాడు.

"రిక్షా కావాలా సార్,"

"వద్దు."

"రిక్షా వద్దా సార్?"

"వద్దు."

"రిక్షా చాహియేసాబ్?"

"నై."

"రిక్షా నకో సాబ్?"

"నకో".

.... .... ....

జాతీయ పొదుపు వుద్యమం మొదలు పెడుతున్నట్లుగా వున్నారు వాళ్ళందరు

"రాండి సార్-రాండి, విజయవిలాస్‌కు నలభై పైసలు."

హుంషారుగా అరిచాడు సూరాయి.

ముప్పయి పైసలు అనగానే వేరేవాడి రిక్షా ఎక్కి వెళ్ళిపోయాడతను.

"అరేయి లింగయ్యా! ముప్పయి పైసల కెన్నడన్నా తోలావురా రిక్షా-ఘోటీ కొత్తావురా? దొంగ లం........"

సూర్యుడు నెత్తిమీద కొచ్చాడు. ఎసూరాయి రిక్షా నడివూళ్లోకి వచ్చింది. కక్కడా బేరం లేదు. సాయంత్రం కిరాయి ఎలా కట్టాలో?

మర్రిచెట్టు కింద ఇద్దరు రిక్షావాళ్ళు బాలమ్మచేతి మిరపకాయ బజ్జీలు మహా వుషారుగా తింటున్నారు, సూరాయి రిక్షా చెట్టుక్రింద చేరింది. బజ్జీలు చూస్తుంటే నోరూరుతున్నది.

"అరేయ్ ఓ పదిపైసలుంటే ఇయ్యరా. అప్పటాళకిస్తా మళ్లీ" పక్కవాడి నడిగాడు.

"అప్పా? నన్నడగొద్దురా-పొద్దుటాళ బట్టీ బేరం లేదు."

"ఛే! ఇశ్వాసం లేదురా మీకు-నిన్న కాక మొన్న సుట్టపీకలకి సస్తావుంటే అర్ధరూపాయ బదులు యియ్యలేదురా-ఈది కుక్క నయ్యంరా నీకంటె"——

బాలమ్మ కిసుక్కున నవ్వి, చిల్లుల గరిటలోని ఆఖరి నూనెచుక్క కూడా మూకుడు లోనే పడేట్టుగా పట్టుకుని వయ్యారంగా, తల సూరాయి వైపు తిప్పింది.

"ఎందమ్మా నవ్వుతావ్?"

"సూదికోసం సోదకి పోతే........"

యింకా పూర్తిగా చెప్పనే లేదు బాలమ్మ.

రక్కునలేచి నిల్చున్నాడు. రిక్షాను చెట్టునీడనుంచి ముందుకు నెట్టాడు.

"సూది---సూదిమందు——నూకలు——

మిరపకాయ బజ్జీలు-సాయంత్రం సారా-రిక్షా కిరాయి — కిరాయి — బజ్జీలు— సూదిమందు — నూకలు—నూకలు— మేకలు—నూకలెట్టా మేకలు కాస్తావ్? నూకలు తింటా—నూకలు తింటా— నూకలు — మేకలు — మేకలతో— కేకలు—కేకలు—పోలమ్మకు రైకలు-- సూదిరా సూది. గుచ్చరా గుచ్చు—నా సాంవిరంగా—కిరాయరా కిరాయి-కిరాయి గాదు నాసాంవిరంగా—ఇత్తా—కిరాయి గాదురో — అకురాయి — సారాయి— బండరాయి—ఏ రాయయ్యితేం. పన్నూడ గొట్టటాన్కి — ఇస్తారా — కిరాయి— కిరాయి కాదు సారాయి నాస్వామిరంగా.

"ఏంపే? కళ్ళు నెత్తికొచ్చినయ్యో రిక్షా మీదనుంచి నడుపుతున్నావ్."

అమాంతం తెలివొచ్చేసింది.

"జర పక్కకెళ్ళి నడవకూడదా? రిచో్ళ్ళ లోకుపైనారు."

"నా జన్మభూమి ఎంతో చక్కనైన దేశము. అందులో నా యిల్లు చల్లని ప్రదేశము" రేడియోలో పాట వినబడు తున్నది.

"సక్కని ప్రదేశం-ఓఁడ్రా సెప్పింది. నా యిల్లుసూడు బహుసక్కని ప్రదేశం నల్లగా వుంటది రొచ్చే? బురదకదూ— పందులు కూడా ఉంటయి ఆడ్నే — నేనా బురదలోనే పెరిగినా-అందులోనే సస్తా. అంతకంటే నేనేనాడు-మావోళ్ళు వోరూ పైకి పోలేదొ్రారేయి."

పాట మారింది, సైకిలురిక్షా పెడలు మీద కాలు గట్టిగా, కసిగా, మంటగా, పడుతున్నది. రిక్షా పెద్దాసుపత్రిదగ్గరకొచ్చే సింది,

## 4

ఆసుపత్రి గేటు దగ్గర ఓ నడివయ సాయన. బుగ్గలు పీక్కుపోయాయి. కళ్ళు ఎర్రగా వున్నాయి. చొక్కా మాసి వుంది. దాంతోపాటు గడ్డంకూడామాసింది. కొంకెరలాంటి ముక్కును మధ్య మధ్య ఒదుతున్నాడు. ఆయన పక్క నిలబడ్డ ఇద్దరూ-ఆయన కేదో చెపుతున్నారు.

జంతు కళేబరాన్ని మెడ రిక్కించి చూచిన రాబందులా, పెడలుమీద నిలు చుని వాళ్ళను చూశాడు సూరాయి. "సెడిండిరా! ఆడదానిదో—మొగాడిదో సిలక లేసిపోయింది" అనుకున్నాడు. దగ్గర గా పోతే బాగుండదని, బెట్టుగా వుండదనీ దూరంగానే రిక్షా ఆపాడు. కనుచూపుమేరలో రిక్షాలు లేవు.

"ఏయ్ రిక్షా"—నువ్వే రక్ష అన్న ట్లుగా పిలిచాడు పెద్దముక్కాయన.

సూరాయి దగ్గరగా వెళ్ళాడు.

"పాలెం తెలుసునా?"

"ఆఁ ఎంతమంది. ఒక్కరా?ఇద్దరా?" లేక ముగ్గురా అన్నట్లుగా మూడోవాడివైపు చూశాడు.

"ఇతనూ-ఓ చిన్నపిల్ల శవం"

"పీనుగ నేసుకపోవాలా?"

"కాకపోతే నువ్వెందుకూ?"

"పాలెం కానా దూరం."

"ఈ మాటలన్నీ వద్దు-ఎంత కావాలో అడుగు."

"ఇరవయి రూపాయలిప్పించండి."

"పది ఇస్తాం—చూడూ—ఆపదలో వున్నారు కదా అని అడిగేయటమే ఎంత పడితే అంత."

"పదేను ఇప్పించండి."

"పన్నెండు చేసుకో."

బేరం కుదిరింది. లోపల్నుంచి పిల్ల శవాన్ని తెచ్చారు. చక్కటి చిలకను మెడపిసికి పారేసినట్లుగావుందిపిల్లమొహం నిండా పదేళ్ళు లేవు.

'సక్కదనాల తల్లి-ఎట్టా సచ్చిందో? ఈ మాయదారి దేముడు ఇంతే. కొంత కొంతమందిని తొందర చేసి తీసుక పోతాడు. కొంతమంది సెన్నాళ్ళయినా మరిసే పోతాడు '—

నిట్టూర్చాడు సూరాయి.

## 5

సాయంకాలం చాలా చల్లగా వుంది. బస్సుస్టాపులల్లో తిరిగే వాళ్ళు, సెంటర్లలో పోజులు కొట్టేవాళ్ళు తెల్లారే ఆపేసుందిగా తీరికుండదు అని కూర కాయలు కొనేవాళ్ళు, పార్కులో బఠాణీలు తింటూ రేడియో వినేవాళ్ళు, "వేడి పెసరట్" అరుపులు—తోపుడుబండ్ల కేకలు, రోడ్లపక్క మల్లెపూల కుప్పల సువాసనలు అందరితో అన్నిటితో హడావిడిగా వుంది బజారు.

సూరాయి కివన్నీ చూడగానే హుషారు వచ్చింది. పొద్దుటినుంచి తిండి తినలేదు అని గుర్తుకు వచ్చింది. అలా వెళు తున్నాడు.

ఒకచోట జనం గుమికూడి వున్నారు. రంగు రంగుల కాగితాలు క్లిప్పులకు తగిలించి వేలాడ దీశారు. రూపాయ కాయితాల్లా వున్నాయి.

"ఏంటి దొరా అయ్యన్నీ" అడిగాడు సూరాయి.

"లాట్రీ టిక్కట్లు. ఓ రూపాయిపెట్టి కొంటే అదృష్టం వుంటే లక్షాధికారి అయిపోవచ్చు." అంతా వివరంగా చెప్పాడు.

"కొను—కొను—ఏలాంటి వాళ్ళకే సామాన్యంగా తగులుతాయి," ఉత్సాహం ఇచ్చాడు రెండోవాడు.

"ఎవడికన్నా తగిలిందా దొరా?"

"మద్రాసులో పదిమంది రిక్షావాళ్ళు తెల్లారే సరికి లక్షాధికారు లయ్యారు. తెలుసా?" దుకాణదారు అందుకున్నాడు.

"ఒక్క రూపాయకు లచ్చ రూపాయలా. ఎన్ని జనమలకి సంపాదించేను. కొంటే బాగే తగులుతే తగులుద్ది. లేకుంటే రూపాయేగా పోయేది'? నిశ్చయించేసు కున్నాడు.

"ఏది కొంటే బాగుదొరా?"

"మద్రాసు తీసుకో"—

మద్రాసు స్టేటు లాటరీ టిక్కెట్టు ఒకటి కొనేశాడు.

"కేరళ టికెట్ ఒకటేవుంది. తగుతే దాంట్లోనే తగలచ్చు-అదృష్టం-నీ కోసమే మిగిలిందేమో."

కేరళ కూడా కొనేశాడు.

'హర్యానాఫస్టుప్రయిజు అయిదులక్షలు పెట్టాడు. చూస్తావా?"

"అయిదు-లచ్చలు" హర్యానా కొనేశాడు.

రిక్షా కదిలింది. ఓ పెద్దమేడ-దాంట్లో ఓ చిన్న తోట-మరి రిచ్చా ఏడ పెట్టాలి? లచ్చలు వచ్చింతర్వాత రిచ్చా లెందుకురా-లుచ్చా" —

లక్షలేమోగాని ఎదురుగా కారు రావడంతో ఆలోచనలకు అంతరాయం కలిగింది. ఇంతలో బాలమ్మ కూర్చునే మర్రిచెట్టు వచ్చింది. అర్ధరూపాయ బజ్జీలు తినేశాడు.

రిక్షా కదిలింది. యజమానింటికి వెళ్ళి కిరాయి కట్టేశాడు. మొత్తం పన్నెండు రూపాయల్లో అయిదు కరిగి పోయాయి.

"అయిన పనేందో అయింది. కాస్త సుక్కే-సుకపోతే" సారా దుకాణంలో దూరాడు.

అరగ్లాసుమీద అరగ్లాసు లోనకు పోతున్నది.

"పోలి ఏం చేస్తున్నాదో .... ఏం చేస్తది. ఏ పక్క గుడిశలోనో ఇన్ని నూకలు బియలు తెచ్చి వుడకేసి ఉంటది. దాసుగోడో? బిగామంతుకి దయ-జొరం తగ్గిపోయుండాల — మన సేతిలో — ఏముంది—"

.... .... ....

చిమ్మచీకటి వేళ—చిరుత పులులు మేకల నోట కరుచుకపోయే వేళ—దగా పడిన చెల్లెళ్ళు—నూతులు,గోతులు వెదుక్కునే వేళ.

దుకాణంలోనుంచి లేచి. మత్తగుల్లలా నడుస్తూ. మ్యునిసిపాలిటీ గుడ్డి దీపాల క్రింద తూలుతూ-త్రేలుతూ-ఇల్లు చేరుకున్నాడు సూరాయి—

అంతా అయిపోయిందిరా దేముడో-దాసు సచ్చిపోయిండురో" ఏడుస్తున్నది పోలి.

నిషా దెబ్బకు దిగిపోయింది. ఎదురుగా దాసుగాడి శవం-శవంమీద శవంలాంటి పోలి-

నిశ్శబ్దంగా నిలబడిపోయాడు. ఏడుపు కూడా రావటంలేదు.

"ఛత్-ఇన్ని తెలిపి ఇయ్యాలకూడా దారితప్పాను" అనుకున్నాడు.

నిజమే వాడు "దారితప్పిన బాటసారి" బ్రతుకు బాట ఎప్పుడో తప్పాడు.

---

## జోగీ, జోగీ

ఒక సన్యాసి :—మనం పుట్టటమే అదృష్టము. పుట్టకుండా ఉంటే ఎంత బావుండేది.

మరో సన్యాసి ;-బావుందయోయ్. అంత అదృష్టానికి పెట్టిపుట్టద్దూ?